నమస్తే తెలంగాణ
# మహబూబ్‌నగర్
నారాయణపేట
12 | మహబూబ్‌నగర్, శనివారం 25 జనవరి 2025 | MAHABUBNAGAR NARAYANPET

• పట్టించుకోని మంత్రి, ఎమ్మెల్యేలు • సర్కారు తీరుపై ప్రజల మండిపాటు

వనపర్తి జిల్లా పెద్దగూడెంలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని అధికారులను నిలదీస్తున్న బోయ చిట్టెమ్మ

# ఆగ్రహం

గందరగోళంగా నాలుగోరోజు గ్రామసభలు

- ఉమ్మడి జిల్లాలో లబ్ధిదారుల ఎంపికలో పొరపాట్లు
- పథకాల జాబితాల్లో అర్హుల పేర్లు లేవని ధ్వజం
- అనర్హులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పేర్లు రావడంపై అసహనం
- పోలీసు పహారా మధ్య నిర్వహణ
- పలుచోట్ల అధికారులు, ప్రజల మధ్య వాగ్వాదం
- సమాధానాలు చెప్పలేక నీళ్లునమిలిన వైనం

## పెద్దగూడెంలో రచ్చరచ్చ

- సమస్యలపై తిరగబడ్డ జనం
- 10 నిమిషాలు కూడా సాగని సభ
- అన్నిగ్రామాల్లోనూ అదే తీరు..

వనపర్తి, జనవరి 24 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో గ్రామసభలు శుక్రవారం ప్రజల రసాభాసల మధ్య ముగిశాయి. చివరి రోజు మొత్తం 16 గ్రామసభలకు గానూ గోపాల్‌పేటలో రెండు, పాన్‌గల్‌లో రెండు, వనపర్తిలో మూడు గ్రామాల్లో జరుగగా, ఆత్మకూరు మున్సిపాలిటీలో రెండు వార్డులు, కొత్తకోటలో ఐదు, పెబ్బేరులో రెండు వార్డుల్లో సభలు నిర్వహించారు. నాలుగు రోజులపాటు సభల్లో ప్రజలు సమస్యలు లేవనెత్తడంతో అధికారులు మమ అనిపించారు. ప్రతిచోటా పోలీసులను పెట్టి సభల నిర్వహణకు ప్రాధాన్యం ఇచ్చారు. చిన్నచిన్న గ్రామాల్లో సమస్యలు అంతగా ఉత్పన్నం కానప్పటికీ పెద్ద గ్రామాల్లో సమస్యలపై ప్రజలు అధికారులను నిలదీశారు. ఏడాది నుంచి సంక్షేమ పథకాలకు ఎదురు చూస్తున్న ప్రజలకు అరకొర లిస్టులతో గ్రామసభల్లో ప్రదర్శన చేస్తుండడంతో పుండుపై కారం చల్లినట్లైంది. గ్రామాలు, మున్సిపాలిటీల్లో చాలా మంది నిరుపేదలు, అర్హుల పేర్లు జాబితాల్లో లేకపోవడంతో గందరగోళాల మధ్య గ్రామ సభలను ముగించారు. నాలుగు రోజుల పాటు జిల్లాలో 348 సభలను కొనసాగించారు.

**గ్రామసభ రసాభాస..**

వనపర్తి మండలంలోని పెద్దగూడెంలో జరిగిన గ్రామసభ రసాభాస అయింది. గ్రామకూడలిలోని ఆంజనేయస్వామి గుడి వరండాలో గ్రామసభ ఏర్పాటు చేయగా, జనం పెద్దఎత్తున తరలి వచ్చారు. అధికారులు గ్రామంలో ఇండ్ల జాబితాలో వచ్చిన వారి పేర్లు చదువుతుండగానే ఒక్కసారిగా అధికారులపైకి తిరగబడ్డారు. లిస్టుల్లో తమ పేర్లు ఎందుకు లేవని, ఎందుకు ఈ సభలు పెట్టారని, నిరుపేదలకు ఇస్తామని కేవలం ఒకపార్టీకి చెందిన వారి పేర్లు చదవడం వల్ల గందరగోళం చెలరేగింది. ఎలాంటి భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం నుంచి లబ్ధిచేకూరడం లేదని గ్రామానికి చెందిన మహిళ అధికారులను నిలదీసింది. పట్టుమని పది నిమిషాలు కూడా సభ ముందుకు సాగలేదు. జనం లేవనెత్తిన సమస్యలతో అక్కడికి వచ్చిన అధికారులు సమాధానాలు చెప్పలేక వెనుదిరిగారు.

జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం చిన్న ఆముదాలపాడులో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

భూములు పోయినా పరిహారం రాలేదు.. రైతుబంధు రావడంలేదని రాజోళి రైతుల ఆగ్రహం

అయిజ మండలం ఉప్పల గ్రామ సభలో ఇందిరమ్మ ఇండ్లపై అధికారులపై మండిపడుతున్న ప్రజలు

## చివరి రోజు అదే సీన్..

ఉమ్మడి జిల్లాలో గ్రామసభల చివరి రోజు అదే సీన్ రిపీట్ అయింది. వనపర్తి మండల పరిధిలోని పెద్ద గూడెంలో జరిగిన గ్రామసభ రసాభాసగా సాగింది. ప్రారంభంలోనే గ్రామంలో మంజూరైన ఇండ్ల లిస్టును చదువుతుండగా గ్రామస్తులు ఒక్కసారిగా అధికారులపైకి దండెత్తారు. లిస్టులో కొందరు పేర్లు వచ్చాయని మిగతావారి పేర్లు ఎందుకు రాలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. అయితే కేవలం 10 నిమిషాలు కూడా గ్రామసభ జరగకపోగా వచ్చిన అధికారులంతా పలాయనం చిత్తగించారు. నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం చిన్నపొర్ల గ్రామసభలో ప్రజలు అధికారులను నిలదీసారు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌నియోజకవర్గంలోని మానవపాడు మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభ గందరగోళానికి దారితీసింది. ఇందిరమ్మ ఇండ్ల జాబితాతో అవకతవకలు జరిగినా యని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఖాళీ స్థలాలు చూయించినా జాబితాలో పేర్లు లేక పోవడం ఏమిటి అని అధికారులను ప్రశ్నించారు. రేషన్ కార్డుల జాబితాలో కూడా అన్యాయం జరిగిందని వాపోయారు. ఉండవెల్లి మండలం చిన్నఆముదాలపాడు గ్రామంలో గ్రామసభ రసాభాసగా సాగింది. అయిజ మండలం ఉప్పల సభలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అర్హులకు చోటు దక్కలేదని అధికారులపై గ్రామస్తులు మండిపడ్డారు. నారాయణపేట జిల్లా కృష్ణ మండలకేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తుల పేర్లు లేక పోవడం.. ఇతర గ్రామాల నుంచి వలస వచ్చిన వారి పేర్లు ఉన్నాయని అధికారులను నిలదీసారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కారుకొండలో పోలీసు పహారాలో గ్రామసభ నిర్వహించారు. అర్హులకు పథకాలు అందలేదని ప్రజలు అధికారులను నిలదీశారు. కౌకుంట్ల మండలం ముచ్చింతల గ్రామసభలో రుణమాఫీపై అధికారులను నిలదీయడంతో తాసీల్దార్ కాంగ్రెస్ నాయకుడిలా మాట్లాడి హామీలు గుప్పించడం విమర్శలకు తావిచ్చింది. దేవరకద్ర మండలంలోని డోకూరు గ్రామసభలో తమ పేర్లు రాలేదని గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూరు గ్రామంలో గ్యారెంటీ స్కీముల జాబితాలో తమ పేర్లు లేవని నిలదీశారు.

మానవపాడులో రైతును బయటికి తీసుకెళ్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్, జనవరి 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆందోళనలు నిరసనలు నిలదీతలు.. బహిష్కరణల మధ్య ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించిన గ్రామసభలన్నీ తుస్సుమన్నాయి. ఆరు గ్యారెంటీల్లో భాగంగా నాలుగు పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని భావించి ఏర్పాటు చేసిన గ్రామసభలన్నీ రణరంగాన్ని తలపించాయి. మంత్రులు ఎమ్మెల్యేలకు కూడా ప్రజలు చుక్కలు చూపించారు. ఇక అధికారులు అయితే సమాధానం చెప్పుకోలేక పోలీసుల సహకారంతో బయటపడ్డారు. శుక్రవారం నాలుగో రోజు కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గ్రామసభలన్నీ వాగ్వాదాలు, నిలదీతలు, నిరసనలతో ముగిశాయి. అర్హుల జాబితాలో తమ పేర్లు లేవంటూ గ్రామస్తులు నెత్తినోరు మొత్తుకున్నా మంత్రి, ఎమ్మెల్యేలు అధికారులు కనికరించలేదు. వాస్తవంగా అర్హులను ఎంపిక చేయాలని గ్రామసభల్లో దరఖాస్తులు తీసుకొని అక్కడికక్కడే పరిష్కరించాలని ఏర్పాటు చేసిన సభలన్నీ అందుకు భిన్నంగా సాగాయి. ముందుగానే ఎమ్మెల్యేలు ఇచ్చిన లిస్టులను గ్రామసభల్లో ఉంచి వాటికి ఆమోద ముద్ర వేయించుకుందామని ప్రయత్నించిన అధికార యంత్రాంగానికి ఎదురుదెబ్బ తగిలింది. అయినా ప్రభుత్వం అర్హులను కాదని అనర్హులకే అందలం ఎక్కించేందుకు సిద్ధమవుతున్నది. ఈనెల 26 నుంచి అధికార పార్టీ ఎమ్మెల్యేల లిస్టులకే గ్యారెంటీ స్కీములు అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. దీంతో గ్యారెంటీలన్నీ గోవిందా.. అంటూ కొందరు పెదవి విరుస్తున్నారు.

**కాంగ్రెస్, బీజేపీ భాయిభాయి**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత గ్రామసభల పేరుతో గ్రామాల్లో చేపట్టిన సభలన్నీ వాడివేడిగా సాగినా కాంగ్రెస్, బీజేపీ నేతలు మాత్రం భాయిభాయిగా తిరిగారు. ఏ గ్రామసభలోనూ ఒక్క బీజేపీ నేత కూడా ప్రశ్నించక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పైగా బీజేపీ నేతలు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులతో చెట్టాపట్టాలేసుకొని గ్రామసభలకు హాజరు కావడం విమర్శలకు తావిస్తోంది. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కూడా గ్రామసభల్లో దర్జాగా పాల్గొని ఎక్కడా లబ్ధిదారుల తరపున మాట్లాడక పోవడం గమనార్హం. పైగా మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో ఎంపీ కోసం అధికార పార్టీ నేతలు రెండు గంటలు వేసి చూడడం విస్తుగొలిపింది. దీంతో కాంగ్రెస్ బీజేపీలు కలిసి గ్రామసభల్లో పాల్గొనడం పలు విమర్శలకు తావిస్తోంది.

**అధికారులు.. పోలీసులు బలి**

రాష్ట్ర ప్రభుత్వం నాలుగు గ్యారెంటీల అమలు కోసం చేపట్టిన గ్రామసభల్లో అధికారులు పోలీసు యంత్రాంగం బలైంది. ఎక్కడికక్కడ ప్రజలు నిలదీస్తుంటే అధికారులను కాపాడలేక పోలీసులు నానా ఇబ్బందులు పడ్డారు. పోలీసులు ఉంటేనే అధికారులు గ్రామసభల్లోకి వెళ్లగలిగే పరిస్థితి ఉమ్మడి జిల్లాలో నెలకొంది. దీంతో అధికార పార్టీ నేతలు ఇండ్లల్లో కూర్చొని జాబితాలు తయారు చేస్తే.. ఆ జాబితాలు పట్టుకొని గ్రామసభకు వెళ్లిన అధికారులకు ప్రజలు ముచ్చెమటలు పట్టించారు. కొన్ని చోట్ల గ్రామసభలు ఉద్రిక్తతకు దారితీసాయి. ఇక మంత్రులు, ఎమ్మెల్యేలు పర్యటించిన ప్రాంతాల్లో సాక్షాత్తు ఎస్పీలే బందోబస్తులు దగ్గరుండి పర్యవేక్షించారు. మిగతా చోట్లా అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్సైతోపాటు పలువురు పోలీసు సిబ్బంది సభల్లో గొడవలు జరగకుండా తమ ప్రాణాలను ఫణంగా పెట్టారు. ఇంటెలిజెంట్ సమాచారం మేరకు గొడవలు జరగని ప్రాంతాలకు ఉన్న తాధికారులు వెళ్లేందుకు పోలీసు యంత్రాంగం మొత్తం రేయింబవళ్లు కష్టపడింది. మొత్తం పైఉమ్మడి జిల్లాలో గ్రామసభలన్నీ అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. ఇక గ్యారెంటీలు అర్హులకు ఇస్తారా అనర్హులకే కట్టబెడతారా వేచి చూడాల్సిందే.

### రాజోళి సభలో రైతుల ఆందోళన

రాజోళి, జనవరి 24 : రాజోళిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో రైతులు ఆందోళన నిర్వహించారు. అయితే భారత్‌మాల రోడ్డులో భూములు కోల్పోయిన రైతుల వివరాలను భూమి రికార్డుల తో పాటు రైతుభరోసా పథకం నుంచి తొలగిస్తున్నట్లు వివరాలను గ్రామసభలో తాసీల్దార్ రామ్మోహన్, ఎంపీడీవో ఖాజా వివరించడంతోపా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సభను అడ్డుకున్నారు. తమ భూముల్లో భారత్‌మాల రోడ్డులో పోయినందుకు ఇప్పటి వరకు నష్టపరిహారం కూడా ఇవ్వలేదని అధికారులు మాకు అన్నీ ఇచ్చినట్లు భూ రికార్డులో మాపేర్లు తీసేయడం, అదేవిధంగా రైతు భరోసా కూడా రాకుండా చేయడం ఏమిటని అధికారులను నిలదీశారు. మాకు నష్టపరిహారం ఇచ్చేంత వరకు రికార్డుల నుంచి తొలగించవద్దని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రజలు సైతం రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాల్లో తమ పేర్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు మరోసారి దరఖాస్తులు ఇవ్వాలని సూచించగా ఎన్ని సార్లు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులపై మండిపడ్డారు.

వనపర్తి జిల్లా పెద్దగూడెం గ్రామసభలో రసాభాస

పెంట్లవెల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

## పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

- కల్వకుర్తిలో రైతుల ఆందోళన

కల్వకుర్తి రూరల్, జనవరి 24 : పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డుకు వివిధ గ్రామాల నుంచి రైతులు పల్లీలను తీసుకురాగా వాటికి మార్కెట్‌లోని వ్యాపారులు సరైన ధరను టెండర్ చేయక పోవడంతో రైతులు హైదరాబాద్ చౌరస్తాకు చేరుకొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇతర మార్కెట్ యార్డుల్లో పల్లీకి మద్దతు ధర రూ. ఏడు వేల వరకు ఉండగా కల్వకుర్తిలో మాత్రం రూ.ఐదు వేలు మాత్రమే ఎలా చెల్లిస్తారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులోని వ్యాపారులు, అధికారులు కుమ్మక్కై ధరను తగ్గించారని ఆరోపించారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించి తమకు న్యాయం చేయాలని కోరారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు, వ్యవసాయ మార్కెట్ అధికారులు రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలోని హైదరాబాద్ రోడ్డుపై బైఠాయించిన చేస్తున్న రైతులు

## ప్రజాప్రతినిధులకు.. సేవతోనే గుర్తింపు

అలంపూర్ మున్సిపల్ పాలకవర్గాన్ని సన్మానించిన ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, జనవరి 24 : ప్రజా ప్రతినిధులకు సేవలతోనే గుర్తింపు వస్తుందని, సమాజ సేవ చేయడానికి పదవులు అక్కర లేదని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఈ నెల 27వ తేదీన కౌన్సిలర్ల పదవి కాలం ముగుస్తుండంతో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ అధ్యక్షతన సాధారణ చివరి సమావేశం నిర్వహించారు. సమావేశం ముగిసిన తర్వాత వికాస భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమతోపాటు వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులను ఎమ్మెల్యే పూలమాలలు, శాలువా కప్పి సన్మానించారు. అంతకుముందు పదవిలో ఉండి అకాల మృతి చెందిన కౌన్సిలర్లు ఎరుకలి దేవన్న, బతుకయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ రాజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్ర

నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

మహబూబ్‌నగర్ అర్బన్, జనవరి 24 : ఆర్టీసీని ప్రైవేట్ పరం చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఐఎన్టీయూసీ, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు విజయ్‌బాబు, నాగరాజు ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదురుగా కార్మిక నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సుల పథకంలో సవరణలు చేసి కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న సబ్సిడీ, ఇన్సెంటివ్‌ను ఆర్టీసీ కార్మికులకు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హకీం, శ్రీనివాసులు, శ్రీలత ఉన్నారు.

## సైబర్ నేరాల సూత్రధారి అరెస్టు

- రూ.80లక్షల ఆస్తులు జప్తు, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సైబర్ క్రైం డీఎస్పీ

సైబర్ కేసు వివరాలను వెల్లడిస్తున్న సైబర్ క్రైం డీఎస్పీ రత్నం

వనపర్తి టౌన్, జనవరి 24 : సైబర్ నేరాల ప్రధాన సూత్రధారి, కరుడుకట్టిన సైబర్ నేరగాడు వర్త్యావత్ రమేశ్‌నాయక్ అలియాస్ లడ్డూ రమేశ్‌ను అదుపులోకి తీసుకొని రూ.80లక్షల ఆస్తులు, కియా కారును జప్తు చేసినట్లు సైబర్ క్రైం డీఎస్పీ రత్నం, సీఐ కృష్ణ తెలిపారు. గత మూడు, నాలుగేండ్ల నుంచి రెండు రాష్ర్టాలకు సంబంధించిన అమాయక ప్రజలను ఇండియా బుల్స్, ధని, ముద్ర లోన్స్ పేరు మీద సైబర్ నేరాల ద్వారా దోచుకుంటున్న సైబర్ నేరస్తులను ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ రత్నం, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఇప్పటి వరకు 29మంది సైబర్ నేరస్తులను అరెస్ట్ చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైబర్ క్రైం డీఎస్పీ రత్నం, సీఐ కృష్ణ సైబర్ క్రైం కేసుల వివరాలను వెల్లడించారు. ఈ నెల 20న మధ్యాహ్నం అలకుంట రాముడు వీపనగండ్ల మండలం పుల్గర్‌చర్ల గ్రామానికి చెందిన డీజే వెంకటేశ్‌కు సైబర్ నేరస్తుడు రమేశ్, బీహార్ రాష్ర్టానికి చెందిన ఇతర సైబర్ నేరస్తుల సహకారంతో ఫోన్ చేసి మీకు రూ.2లక్షల లోన్ మంజూరయ్యిందని చెప్పారు. అందుకు గాను మీరు ముందుగానే ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని వారికి గూగుల్ పే ద్వారా డాక్యుమెంటరీ చార్జీల పేరిట విడుతల వారీగా సుమారు రూ.33,993 ఆన్‌లైన్‌లో పంపించాడు. చివరికి లోన్ రాక పోవడంతోపాటు మోసపోయాయని గుర్తించిన వెంకటేశ్ 1930 కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు సైబర్ నేరాల ప్రధాన సూత్రధారుడు, కరుడు గట్టిన సైబర్ నేరగాడు వర్త్యావత్ రమేశ్‌నాయక్ అలియాస్ లడ్డూ రమేశ్‌ని పెద్దమందడి మండలం బలిజపల్లి గ్రామం సేవాలాల్‌తండాలో పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడు రమేశ్ పెద్దమందడి మండలంలోని తండాలు, మహబూబ్‌నగర్ జిల్లాలోని తండాలు వివిధ గ్రామాలకు చెందిన అనేక మంది యువకులను సైబర్ నేరాలు చేసేందుకు ఢిల్లీ, కోల్‌కత్తా, పాట్నాలకు పిలిపించి వారికి శిక్షణ ఇప్పించేవాడు. రోహిత్ అలియాస్ రాజుబాయ్, పవన్, జి.రాజు అలియాస్ రాజు భల్లం, శివకుమార్ అలియాస్ శంకర్‌జీ, పంకజ్, అంకిత్ సహకారంతో సైబర్ నేరాలు చేయించి వారు వసూలు చేసిన డబ్బులలో వారి వాటా కింద 30 శాతం ఇప్పించి బీహార్ రాష్ర్టానికి చెందిన వారి ద్వారా కమిషన్ డబ్బులు తీసుకునేవాడు. ఆ విధంగా నిందితుడు ఇప్పటివరకు సుమారు రూ.కోటి కంటే ఎక్కువగానే సంపాదించాడు. ఈ క్రమంలో నేరస్తుడికి సహకరించిన అతని అన్న చంద్రశేఖర్, తన అమ్మ గోపమ్మని కూడా ఈ నేరంలో నేరస్తులుగా చేర్చినట్లు వారు వెల్లడించారు. నిందితుడు సైబర్ నేరాల ద్వారా సంపాదించిన డబ్బులతో తన తండాలో సుమారు రూ.45లక్షలు ఖర్చుపెట్టి ఒక ఇల్లు కట్టుకున్నాడని, వనపర్తి పట్టణంలో సూర్యచంద్రస్కూల్ సమీపంలో రూ.24లక్షల విలువగల రెండు ప్లాట్లను కొనుగోలు చేశాడు. అదేవిధంగా రూ.12లక్షల50వేల విలువ గల కియా కారును, ఒక మొబైల్ ఫోన్‌ను కొనుగోలు చేసి మిగిలిన డబ్బులను తన జల్సాలకు ఖర్చుపెట్టాడని చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టు హాజరుపర్చడంతోపాటు నిందితుడి కారు, మొబైల్ ఫోన్, స్థిరాస్తి పత్రాలు జప్తు చేసి కోర్టులో సమర్పించినట్లు చెప్పారు.

ఈ కేసు ఛేదించిన జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ కృష్ణ, బ్యూరో ఎస్సై రవిప్రకాశ్, వీపనగండ్ల ఎస్సై రాణితోపాటు పలువురు పోలీసు సిబ్బందిని ఎస్పీ రావుల గిరిధర్ అభినందించారు.

## గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు విద్యార్థి

వనపర్తి టౌన్, జనవరి 24 : జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కో-ఎడ్)లో బీఎస్సీ ఎంపీసీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎం పవన్‌కుమార్ రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రఘునందన్ తెలిపారు. పవన్‌కుమార్‌ను శుక్రవారం ప్రిన్సిపాల్‌తోపాటు ఎన్‌సీసీ అధికారి ఉమా, దాంసింగ్‌తోపాటు అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని..

- పెద్ద ధన్వాడలో కొనసాగుతున్న నిరాహారదీక్ష
- 11 గ్రామాల రైతుల మద్దతు

రాజోళి, జనవరి 24 : రాజోళి మండలంలోని పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలంటూ గ్రామస్తులు చేపట్టిన నిరాహారదీక్ష శుక్రవారం రెండో రోజుకు చేరుకుంది. వీరి దీక్షకు చుట్టుపక్కల ఉన్న 11గ్రామాలకు చెందిన రైతులు మద్దతు తెలుపుతూ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే మండలంలోని వివిధ గ్రామాల్లోని పంట భూములు నాశనమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాల ద్వారా తుంగభద్ర నది తోపాటు పరిసర గ్రామాల్లో తాగునీరు కూడా కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖులు రామచంద్రారెడ్డి, సంజీవరెడ్డి, శశికుమార్, అంజి, అడివిస్వామితోపాటు పలువురు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో పెద్ద ధన్వాడతోపాటు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రాజోళి మండలం పెద్దధన్వాడలో రిలేదీక్షలు నిర్వహిస్తున్న రైతులు